సునార్‌లేన్‌లో లోప్రెషర్ సమస్యను పరిష్కరించండి



సునార్‌లేన్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

కాచిగూడ: సునార్‌లేన్‌లో కొంత కాలంగా తాగునీరు లోప్రెషర్‌తో రావడంతో స్థానికులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో సమస్యను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌కు వివరించామని తెలిపారు. బుధవారం కాచిగూడ డివిజన్‌లోని సునార్‌లేన్‌లో కార్పొరేటర్ పర్యటించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్య సత్వర పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆర్.సంతోష్, కృష్ణ, బి.భీమ్‌రాజ్, సూరి, ఎస్.రవియాదవ్, వాసు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'దాసరి ప్రతిభా' పురస్కారానికి డా. నీలా శ్రీధర్ ఎంపిక



కాచిగూడ: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ ఉపాధ్యక్షుడు, వాసవీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్‌ను 'దాసరి ప్రతిభా'పురస్కారానికి ఎంపికై నట్లు దాసరి ఫిల్మ్ అవార్డ్స్ ఫౌండర్ చైర్మన్ తుమ్మనపల్లి రామసత్యనారాయణ తెలిపారు. గత 35 సంవత్సరాలుగా సాహితీ, సాంస్కృతిక సమాజ సేవా రంగాల్లో నీలా శ్రీధర్ అందించిన విశేష సేవలను గుర్తించి తమ్మారెడ్డి భరద్వాజ, సి.కళ్యాణ్, రేలంగి నరసింహారావు, జర్నలిస్ట్ ప్రభులతో కూడిన అవార్డు కమిటీ ఆయనను ఎంపిక చేసిందని పేర్కొన్నారు. మే 1వ తేదీన హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవ వేడుకల్లో నీల శ్రీధర్‌కు అవార్డును అందజేస్తామని తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు ప్రవీణ్‌పటేల్ సేవలు చిరస్మరణీయం



ప్రవీణ్ పటేల్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ నేత స్వర్గీయ రాగుల ప్రవీణ్ పటేల్ ప్రథమ వర్ధంతిని బుధవారం అంబర్‌పేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హాజరై ప్రవీణ్‌పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ పటేల్ కుటుంబానికి ఎమ్మెల్యే రూ.3లక్షల ఆర్థిక చేయూతను అందజేశారు. ప్రవీణ్ పటేల్ పిల్లల చదువు బాధ్యతను తాను చూసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. బీఆర్‌ఎస్‌కు ప్రవీణ్‌పటేల్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు ఎర్రబోలు నర్సింహారెడ్డి, సిద్ధార్థ్, ఆంజనేయులు, మధుసూదన్, శ్రీరాములు, రామారావు, నాగరాజు, గెల్వయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే యాదవుల అంతిమ లక్ష్యం

కాచిగూడ: రాజ్యాధికారమే యాదవుల అంతిమ లక్ష్యమని దాని కోసం యాదవులు సంఘటితంగా ఉద్యమించాలని యాదవ సంఘం చైర్మన్ నందకిషోర్ యాదవ్ పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడు బోయిని వెంకటేష్ యాదవ్ అధ్యక్షతన బుధవారం చెప్పల్‌బజార్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యాదవుల సంక్షేమం, సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ పరిధిలోని 19 అసెంబ్లీ నియోజకవర్గాలకు అధ్యక్షులను నియమించారు. ఈ కార్యక్రమంలో వుశ్కెల కిషన్‌యాదవ్, పాటేల్ కృష్ణయాదవ్, గోపాల్ యాదవ్, మనీష్ యాదవ్, శైలేందర్ యాదవ్, రామారావు యాదవ్, పాండు యాదవ్, లడ్డుయాదవ్, రమేష్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాలమ్మకు దళితరత్న అవార్డు

ముషీరాబాద్: డక్కలి కుల సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు, రాంనగర్ వాసి బాణాల సాలమ్మకు దళితరత్న అవార్డు వరించింది. బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటిక రాజు, మాదిగ ఉప కులాల రాష్ట్ర చైర్మన్ మెడి పాపయ్యమాదిగ, బేడా, బుడగ జంగం రాష్ట్ర వ్యావస్థాపక అధ్యక్షులు టి.హనుమంతరావులు ఆమెకు దళిత రత్న అవార్డును బుధవారం ప్రదానం చేశారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

నల్లకుంటలో ఓపెన్ పాయింట్ల వద్ద పేరుకుపోతున్న వ్యర్థాలు | చెత్త తరలింపులో రాంకీ సంస్థ సిబ్బంది నిర్లక్ష్యం | పట్టించుకోని జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు



నల్లకుంట గోల్నాక కల్లు కాంపౌండు ప్రహరీ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

నల్లకుంట: డివిజన్ పరిధిలోని ఏ వీధిలో చూసినా ఓపెన్ పాయింట్ల వద్ద చెత్తాచెదారం పేరుకుపోతోంది. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతుండటం కారణంగా దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఓ వైపు ఉక్కపోత, దుర్వాసన.. మరో వైపు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో చెత్త తరలింపు జీహెచ్‌ఎంసీ నిర్వహణలో ఉండేది. ఆ సమయంలో పారిశుద్ధ్య కార్మికులు వీధులు శుభ్రం చేసి ఆయా ప్రాంతాల్లోని ఓపెన్ పాయింట్ల వద్ద కుప్పగా పోగుచేసే వారు. ఇలా పోగుచేసిన చెత్తను వెంటనే జీహెచ్‌ఎంసీ వాహనాల్లో ఎప్పటికప్పుడు అక్కడి నుంచి తరలించే వారు.

రాంకీ సంస్థకు అప్పగించినప్పటి నుంచి నిర్లక్ష్యం..

☛ ఇటీవల చెత్త తరలింపును రాంకీ సంస్థకు అప్పగించారు. ఓపెన్ పాయింట్ల వద్ద పేరుకుపోయే చెత్త ఇతర వ్యర్థాలను ప్రతి రోజు చెత్తను తరలించాల్సిన ఆ సంస్థ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇదిలా ఉండగా చెత్త తరలింపునకు వాహనాలు చిన్నవి ఏర్పాటు చేయడంతో ఒక చోట చెత్త ఎక్కువగా ఉంటే కొంత తరలించి మరికొంత అలాగే వదిలేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

గార్డెన్ ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యేకు వినతి..

టీఆర్టీ కాలనీ షటిల్ కోర్టు సమీపంలో ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలాన్ని చదును చేయించి గార్డెన్ ఏర్పాటు చేయాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఇటీవల ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు వినతి పత్రం సమర్పించారు. పారిశుద్ధ్య పమస్యపై జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌వో హేమలతకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఎమ్మెల్యేకు వివరించామని వారు తెలిపారు.

చెత్త పేరుకుపోతున్న పాయింట్లు ఇవే..

☛ నల్లకుంట శంకరమఠం ప్రధాన రహదారిలో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదురుగా.
☛ తిలక్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన
☛ గోల్నాక కల్లు కాంపౌండ్ ప్రహరీ వద్ద
☛ న్యూనల్లకుంట రైల్వే బ్రిడ్జి పక్కన
☛ నర్సింహబస్తీ, టీఆర్టీకాలనీ, న్యూ నల్లకుంట మదర్ డెయిరీ పార్కు.
☛ టీఆర్టీ కాలనీ షటిల్ కోర్టు ప్రహరీని ఆనుకుని రెండు వైపులా చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ఆ దారి గుండా వచ్చిపోయే వాళ్లు అక్కడ మూత్ర విసర్జన చేస్తున్నారు.
☛ టీఆర్టీ కాలనీ విజయగణపతి దేవాలయం సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయింది. దీనికి తోడు డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌లోంచి తొలగించిన సిల్ట్ (వ్యర్థాలు) వీధుల్లోనే కుప్పలుగా పోసి వదిలేస్తున్నారు. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు.



టీఆర్టీకాలనీ షటిల్ కోర్టు మెయిన్ గేట్ వద్ద పేరుకు పోయిన చెత్తాచెదారం



షటిల్ కోర్టు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వ్యర్థాలు



నల్లకుంట ప్రధాన రహదారి నుంచి స్ట్రీట్ నం.4కు వెళ్లే మూల మలుపు వద్ద ఇలా..

ఆర్‌యూవీ పథకానికి 3840 దరఖాస్తులు

అంబర్‌పేట: రాజీవ్ యువ వికాసం(ఆర్‌యూవీ) పథకానికి అనూహ్య స్పందన వచ్చింది. అంబర్‌పేట నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, మైనార్టీలు పెద్ద ఎత్తున రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. చివరి గడువు ఈ నెల 14తో ముగిసింది. నియోజకవర్గంలో ఉన్న ఐదు డివిజన్ల వారీగా దరఖాస్తులను తీసుకున్నారు. మొత్తం 3840 దరఖాస్తులు వచ్చాయి.



అంబర్‌పేట వార్డు కార్యాలయం

డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తులు...

కాచిగూడ	221
నల్లకుంట	459
గోల్నాక	772
అంబర్‌పేట	1489
బాగ్‌అంబర్‌పేట	611

ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో చేవెళ్ల వేదికగా ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించారని వెంటనే ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు పుట్టం గండి శ్రీనివాస్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పోరాట సమితి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 80 అసెంబ్లీ నియోజకవర్గాలలో లంబాడీ ఓట్లు అధికంగా ఉన్నాయని అయితే గతంలో కేసీఆర్ మోసం చేసినట్లుగా రేవంత్‌రెడ్డి మోసం చేస్తే సహించబోమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపిస్తే 16 నెలలు గడుస్తున్న మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు న్యాయం జరగలేదన్నారు.
☛ సభకు అధ్యక్షత వహించిన నంగార భేరి లంబాడీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ధారవత్, గణేష్ నాయక్ మాట్లాడుతూ... కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులైన మూడవత్ రాంబల్ నాయక్ , రాజేష్ నాయక్, రాందాస్ నాయకులకు లంబాడీ హక్కుల పోరాట సమితితో ఎలాంటి సంబంధం లేదన్నారు. తమ సంఘం పేరు చెప్పి చలామణి అవుతున్న వారి పట్ల తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి నాయకులు వెంకట్ బంజార, రమేష్ నాయక్, మహిళ నాయకులు పూని బాయి, దేవిబాయి,లచ్చిబాయి తదితరులు పాల్గొన్నారు.



లంబాడీ హక్కుల పోరాట సమితి సమావేశంలో మాట్లాడుతున్నా గణేష్‌నాయక్ తదితరులు

సివిల్ కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

జీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం సౌత్ ఇండియా ఇన్‌చార్జి సూర్యనారాయణ అధ్యక్షతన బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, సివిల్ కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పించకుండా మోసం చేసిందని ఆరోపించారు. బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ పరిధిలో ఉన్న మెయింటనెన్స్ కాంట్రాక్టులను బీసీలకు కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయడంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నందున న్యాయ నిపుణులతో లోతుగా చర్చించి అమలు కోసం పగడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్ల కోసం ఒక బిల్లు, రాజకీయ రిజర్వేషన్ల కోసం మరొక బిల్లు ఉందన్నారు. ఈ రెండు బిల్లులను కేంద్రానికి పంపి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూడటం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల సంక్షేమానికి ఉపయోగపడే బీసీ రిజర్వేషన్ బిల్లుని ఆమోదించాలని కోరారు. అమల్లోకి వచ్చే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.



కాచిగూడలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి



సింగాడికుంటలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

కవాడిగూడ: బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా బుధవారం సింగాడికుంట చౌరస్తాలో పార్టీ జెండాను ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తమ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఎం.రమేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్‌ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, నాయకులు జి.వెంకటేష్, ఎంసీ మహేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో మరిన్ని వసతులు కల్పించండి

కాచిగూడ: హిందూ శ్మశానవాటికలో మరిన్ని మెరుగైన వసతులను కల్పించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని హిందూ శ్మశానవాటిక ట్రస్ట్‌బోర్డు అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ కోరారు. బుధవారం కాచిగూడ హర్రస్‌పెంటలోని హిందూ శ్మశానవాటిక ప్రాంగణంలోని ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్మశానవాటిక అభివృద్ధి విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నగరంలోని 292 శ్మశానవాటికల్లో అతిపెద్దదైన కాచిగూడ హిందూ శ్మశానవాటిక అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. శ్మశానవాటికను అనుకొని ఉన్న మూసీ మొత్తం చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వస్తోందన్నారు. శ్మశానవాటికలో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో నిర్మించినట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ విగ్, సాయిగిరిధర్, సి.నందకిషోర్ యాదవ్, రతన్ విద్యాసాగర్, విజయ్ కుమార్, కృష్ణాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



శ్మశానవాటిక ప్రాంగణంలోని ఆలయంలో మాట్లాడుతున్న రాజేందర్ పటేల్‌గౌడ్

కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

మహాధర్నాలో పలువురు వక్తలు డిమాండ్

కవాడిగూడ: రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలల్లో పనిచేస్తున్న (బడ్జెట్ అండ్ ఫైనాన్స్) కాంట్రాక్ట్ అధ్యాపకుల ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా యూజీసీ వేతనాలు ఇవ్వాలని కోరారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్స్, ప్రొఫెసర్స్ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మధుసూదనాచారి, ఎమ్మెల్సీఅంజిరెడ్డి, ఎంపీ ఆర్ కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య, సీపీఎం నాయకులు నర్సింహ, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు ఈ ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1990లో మొదలైన కాంట్రాక్ట్ వ్యవస్థ ఇప్పటికే అనేక మంది జీవితాలను ఆగం చేసిందని పేర్కొన్నారు. అసలు కాంట్రాక్ట్ వ్యవస్థనే పెద్ద అన్యాయం అన్నారు. ప్రభుత్వాలు వెంటనే ఈ కాంట్రాక్ట్ వ్యవస్థ లేకుండా అందరిని వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరశురాం, విజేయేందర్‌రెడ్డి, ఉపేందర్, కుమార్, రవి, వెంటేశ్వర్లు, కరుణాకర్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మహాధర్నాలో అభివాదం చేస్తున్న వివిధ పార్టీ నేతలు

27న స్ఫూర్తి నేషనల్ డ్యాన్స్ ఫెస్ట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్ఫూర్తి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రపంచ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్ఫూర్తి నేషనల్ డ్యాన్స్ ఫెస్ట్–2025ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు కొరియోగ్రఫర్ సూర్యతేజ, సుబ్రాంత్ మాస్టర్ తెలిపారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, పేరిని, దేశభక్తి, జానపద తదితర అంశాలలో నాట్య ప్రతిభ ప్రోత్సహించాడానికి ఈ కార్యక్రమాన్ని చేస్తున్నట్టు తెలిపారు. ఆరేళ్ల వయస్సు నుంచి 60 ఏళ్ల నాట్య కళాకారులు ఈ ఫెస్ట్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈనెల 20లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 96523 47207లో సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం

ముషీరాబాద్: ఇటీవల గుండెపోటుతో మరణించిన నాగమయ్య కుంటకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త మణిరత్నం(బబ్లు) కుటుంబాన్ని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ పరామర్శించి ఆర్థికంగా సహాయాన్ని అందించారు. మణిరత్నం కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేశారని వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్, కవాడిగూడ డివిజన్ల అధ్యక్షులు తిరుమల్‌రావు, భాస్కర్, నాయకులు శ్రీనివాస్, బాబు, అనూషా, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మణిరత్నం కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్

ఈ నీటిని తాగేదెలా.?

- నల్లకుంట డివిజన్‌లో కొన్ని నెలలుగా కలుషిత నీటి సరఫరా
- సమస్యకు గల కారణాలను గుర్తించలేకపోతున్న అధికారులు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని తిలక్‌నగర్ గాంధీ బొమ్మ నుంచి బతుకమ్మ కుంట మెయిన్ రోడ్డుకు వెళ్లే చిన్న వీధిలో కొన్ని నెలలుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. మొదటి గంట కలుషిత నీరు సరఫరా అవుతోందని ఆ తర్వాత కాస్త శుభ్రమైన నీరు సరఫరా అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నీటిని ఇంటి అవసరాలకు వాడుకుంటున్నామని తెలిపారు. తాగడానికి మాత్రం బయట నుంచి నీళ్ల క్యాన్లు కొనుక్కుంటున్నామని చెబుతున్నారు. కొందరు ఈ నల్లా నీటిని తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. జలమండలి అధికారులు కలుషిత నీటి సరఫరాకు గల కారణాలు గుర్తించలేక పోతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కలుషిత నీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బస్తీ వాసులు కోరుతున్నారు.



తిలక్‌నగర్ గాంధీ బొమ్మ వీధిలో సరఫరా అవుతున్న కలుషిత నీరు

గ్రాడ్యుయేషన్ డే

చిక్కడపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని కార్పొరేటర్ పావని ఆకాంక్షించారు. అశోక్‌నగర్‌లోని గీంతాజలి ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ప్రీప్రైమరీ గ్రాడ్యుయేషన్ డేలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు చిన్నారులను చదువుతో పాటు క్రీడాంశాల్లోనూ ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, అభిషేక్, నీరజ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

కూలుతున్న నాలా పైకప్పులు

- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు
- అస్తవ్యస్తంగా మారిన వీధుల్లోని మ్యాన్‌హోళ్లు

నల్లకుంట: డివిజన్ పరిధిలోని అన్ని అంతర్గత వీధుల్లోని మ్యాన్‌హోళ్లు అస్తవ్యస్తంగా మారాయి. అభివృద్ధి పనుల పేరిట రోడ్లను తవ్వి పోసే సమయంలో జలమండలి అధికారులు సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పనులు పూర్తయిన తర్వాత నాసిరంగా మ్యాన్‌హోళ్లు నిర్మిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే అవి కొన్నాళ్లకే కుంగిపోతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో అయితే నాలాలపై శ్లాబులు కూలిపోతున్నాయి. బాక్స్ నాలాలపై శ్లాబులు కూలిన కొన్ని నెలల వరకు మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులే చెబుతున్నారు. జలమండలి, ఇరిగేషన్ శాఖల అధికారులు స్పందించి సరైన సమయంలో వాటికి మరమ్మతులు చేపడితే ప్రమాదాలు తప్పుతాయని అభిప్రాయపడుతున్నారు.



పాత రామాలయం సమీపంలోని వీధిలో ప్రమాద సూచికగా ఓ మొద్దు, రాళ్లు ఏర్పాటు



ఫీవర్ చౌరస్తాలోని శైలా కేఫ్ పక్కన నాలా శ్లాబ్‌పై ఏర్పడిన గుంత

◆ పాత నల్లకుంట పాత రామాలయం సమీపంలోని ఇంటి ననంబర్ 2–1–261/ఏ ఎదురు వీధిలో వర్షపు నీటి కాలువ మ్యాన్‌హోల్ పక్కనే నెల రోజుల క్రితం శ్లాబ్ కూలిపోయింది. శ్లాబ్ కూలిన సమయంలోనే మరమ్మతులు చేపట్టి ఉంటే సమస్య మరింత పెద్దగా అయ్యేది కాదు. కాని సంబంధిత శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.
◆ ఈ వీధి గుండా కార్లు, ఆటోలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుండడంతో ఆ శ్లాబ్ కాస్త మరింత పెద్దగా కూలి ప్రమాదకరంగా మారింది. దీంతో శ్లాబ్ కూలిన చోట స్థానికులు ప్రమాద సూచికగా ఓ పెద్ద చెట్టు మొద్దు, సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు.
◆ అలాగే ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా సమీపంలోని శైలా కేఫ్ వద్ద రోడ్డుపై శ్లాబ్‌కు రెండు, మూడు రంధ్రాలు ఏర్పడ్డాయి. నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి బాక్స్ నాలాలపై కూలిన శ్లాబులకు మరమ్మతులు చేపట్టేలా అధికారులను ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు.